# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలోని మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **భారత అంతరిక్ష పరిశోధన సంస్థ..ఇస్రో భూ పరిశీలన కోసం కొద్దిసేపటి క్రితం పీఎస్ఎల్వీ–సీ 61 ద్వారా పంపిన ఈఓఎస్–09 ఉపగ్రహ ప్రయోగంలో సాంకేతిక సమస్య తలెత్తింది.**
3. **మహిళలే దేశానికి ఆదర్శమని, కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు.**
5. **రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టంచేశారు.**

==========================

రాష్ట్రంలోని మహిళలందరికీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కర్నూలులో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో నిన్న ఆయన పాల్గొని.. ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రజలతో ప్రమాణం చేయించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచాలని చంద్రబాబు నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో జరగనున్న ప్రపంచ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి వివరిస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆశీస్సులు అందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. నిన్న రాత్రి ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసంలో నరేంద్ర మోదీతో లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి 'యువగళం' కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించి.. మంత్రి లోకేశ్ నుంచి మొదటి ప్రతిని అందుకున్నారు. 2024 ఎన్నికలకు ముందు లోకేశ్ చేపట్టిన 3 వేల 132 కిలోమీటర్ల పాదయాత్ర విశేషాలను ఈ కాఫీ టేబుల్ బుక్‌లో పొందుపరిచారు.

-------------------------

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ..ఇస్రో భూ పరిశీలన కోసం రూపొందించిన ఈఓఎస్–09 ఉపగ్రహ ప్రయోగంలో సాంకేతిక సమస్య తలెత్తింది. కొద్దిసేపటి క్రితం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం..షార్ నుంచి పీఎస్ఎల్వీ – సి 61 వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. అయితే ప్రయోగం తొలి రెండు దశలు సాధారణంగానే కొనసాగినా.. మూడవ దశ తర్వాత సాంకేతిక సమస్య తలెత్తినట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రయోగం పూర్తికాలేదని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఇస్రో ఛైర్మన్ వివరిస్తూ...

.. వాయిస్... 29 సెకన్లు...

-------------------------

పార్టీలకు అతీతంగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పదవులు, రాజకీయ పార్టీలు శాశ్వతం కాదని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 6 కోట్ల రూపాయలతో నిర్మించిన రిజర్వాయర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ విజయలక్ష్మితో కలిసి కేంద్ర మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టంచేశారు.

-------------------------

మహిళలే దేశానికి ఆదర్శమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో వీ హబ్ ఉమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను మహిళలకే అప్పగించామని.. మహిళలకు ఇచ్చే ప్రతి రూపాయి వడ్డీతో సహా చెల్లిస్తున్నారని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు.

-------------------------

రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. లబ్ధిదారులకు ఆ ఇళ్లను ఒకే రోజు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. విజయవాడలోని గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని జిల్లాల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణ సామగ్రిని సకాలంలో అందజేస్తూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పార్థసారథి స్పష్టం చేశారు.

-------------------------

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టంచేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిన్నఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పంట కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం 344 కోట్ల రూపాయలు కేటాయించిందని చెప్పారు. కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టామని, ఈ నెలాఖరులోగా పూర్తి

చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కాల్వల వెంబడి గ్రావెల్ రోడ్లు, కాంక్రీట్ గోడలు నిర్మిస్తున్నామని మంత్రి రామానాయుడు వెల్లడించారు.

---------------------------

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ గ్రామాల రూపురేఖలను మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లోని రోడ్ల మరమ్మతులతోపాటు నూతనంగా రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు.

---------------------------

వచ్చే నెల 21వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. కమిటీలో మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కందుల దుర్గేష్ ఉన్నారు. కన్వీనర్‌గా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు వ్యవహరిస్తారని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని 15 వేల 4 గ్రామ, వార్డు సచివాలయాలను గ్రూపులుగా విభజించి, ఆయా సచివాలయాల్లోని ఉద్యోగులను వర్గీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భౌగోళిక పరిస్థితుల ఆధారంగా రెండు లేక మూడు సచివాలయాలను ఒక గ్రూపుగా.. మొత్తం 15 వేల 4 సచివాలయాలను 7 వేల 715 గ్రూపులుగా విభజించాలని కలెక్టర్లు చేసిన ప్రతిపాదనలకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా సచివాలయాల్లో జనాభా ఆధారంగా ఏయే కేటగిరి పోస్టులు నియమించాలో, ఏయే కేటగిరి టెక్నికల్ సిబ్బంది ఉండాలో నిర్ణయించింది.

---------------------------

'పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకగా భారత సైన్యం.. 'ఆపరేషన సిందూర్' పేరిట ధీటైన సమాధానం ఇచ్చింది. 140 కోట్ల మంది భారతీయుల విజయమిది' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో.. ఆపరేషన సిందూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా నిన్న తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో భద్రతాదళాలు దేశానికి గర్వకారణంగా నిలిచాయన్నారు.

---------------------------

వివిధ ప్రాంతాల్లోని ఉష్ణోగ్రతలను తెలుసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ రూపొందించిన 'స్మార్ట్ హీట్ అలెర్ట్ కార్డ్'ను రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–'స్వచ్ఛాంధ్రలో భాగంగా వేడిని తరిమి కొట్టండి ఇతివృత్తంతో ఆ కార్డును సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కూర్మనాథ్‌తో కలసి, ఆమె ఆవిష్కరించారు.

=====================